

హిందీ ఉపాధ్యాయుడికి అవార్డు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ దేవనగరి సేవ సమ్మాన్ పురస్కారాన్ని ఆదివారం హైదరాబాదులోని మిస్ ఏసియా - 2020 పూజ నిగం చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ దేవనగిరి ఉద్దాన్ ఫౌండేషన్ వారు భారత దేశంలోని అన్ని రాష్ట్రాలలో హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నటువంటి ఉపాధ్యాయులను గుర్తించి వారికి ప్రతి ఏటా పురస్కారాలను అందిస్తున్నారని అన్నారు. 2024 సంవత్సరానికి గాను ఆంధ్ర ప్రదేశ్ నుంచి తనను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.



అవార్డు అందుకుంటున్న సయ్యద్ సర్తాజ్ హుస్సేన్

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

- డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన డైట్ కళాశాల నుంచి బంగ్లా సర్కిల్ వరకు జరిగిన ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నిశ్శబ్దాన్ని ఛేదించి ప్రతీ ఒక్కరూ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి గురించి మాట్లాడుకున్నపుడే ప్రజల్లో హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధిపై చైతన్యం వస్తుందని అన్నారు. 'హక్కుల మార్గాన్ని అనుసరిద్దాం నా ఆరోగ్యం నా హక్కు'తో ముందు కెళ్లాలని అన్నారు. దేశంలో ఉన్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులలో రాష్ట్రం రెండవ స్థానంలో ఉందని అన్నారు. జిల్లాలో ఎఆర్‌టి కేంద్రాల ద్వారా చికిత్స పొందుచున్న వ్యాది గ్రస్తులు 4624 మంది ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 9 ఐసిటిసి కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని అన్నారు. అవగాహన తోనే ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిని నియంత్రణ చేయడానికి వీలుంటుందని తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలు, స్వయం సహాయక బృంద సభ్యులకు అవగాహన కార్యక్రమాలు చేపడు తున్నామని తెలిపారు. ముగ్గుల పోటీలు, స్కిట్స్, ఫోక్ సాంగ్స్ ద్వారా చైతన్య పరుస్తామని పేర్కొన్నారు. హెచ్ఐవి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని, చికిత్స కంటే నివారణే మంచిదని తెలిపారు. హెచ్ఐవి సంక్రమిత వ్యక్తితో సురక్షితం కానీ లైంగిక సంపర్కం, కలుషితమైన రక్తం ఎక్కించడం వల్ల, పరిశుభ్రం లేని సూదులు, సిరంజీలు ఉపయోగించడం వల్ల , తల్లి నుంచి ప్రసవ సమయంలో బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. స్పర్శ ద్వారా, దోమ కాటు ద్వారా, వ్యాధిగ్రస్తులకు సేవలు చేయడం ద్వారా,ఆహారం, దుస్తులు పంచుకోవడం, మరుగుదొడ్లు ఉపయోగించుకోవడం ద్వారా వ్యాధి సంక్రమించదని తెలిపారు. ప్రభుత్వం హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు రూ.4 వేలు ఫింఛన్ అందిస్తోందని అన్నారు. ప్రపంచంలో మొదటి కేసు 1981లో లాస్ ఏంజిల్స్‌లో నమోదు అయిందన్నారు. శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యం బాగుండాలి అంటే ఆరోగ్య సమస్యలుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనభరచిన పీలేరు, మదనపల్లి, కోడూరు, రాయచోటి సిబ్బందికి ప్రశంసా పత్రాలు,మొమెంటోలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ స్కీం సిపిఎం హైదర్, రోటరీ క్లబ్ చైర్మెన్ కెవిఎస్.నాయుడు, డైట్ ప్రిన్సిపల్ శివ భాస్కర్, ప్రజా చైతన్య సేవ సంఘం అధ్యక్షులు చెన్నారెడ్డి, ఎఎస్ఐ సర్దార్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, బలరామరాజు, సిహెచ్ఒ నారాయణ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య

తాగునీటి ఎద్దడిని నివారిస్తాం : మంత్రి

ప్రజాశక్తి- రామాపురం

నియోజకవర్గ వ్యాప్తంగా మారు మూల గ్రామాలకు సైతం తాగునీటి సమస్య లేకుండా చూడడమే తమ లక్ష్యమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ భైనేని దళితవాడలో ఆదివారం తాగు నీటి సమస్య పరిష్కారం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ స్కీమ్‌ను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గజమాలలతో డప్పు వాయిద్యాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం తాగునీటి సమస్య లేకుండా చేయడమే తన మొదటి ప్రాధాన్యత అన్నారు. తాగునీటితోపాటు, సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే గ్రామాలలో సిమెంట్ రోడ్లు, తాగునీటి పరిస్థితి మెరుగుపరచడానికి బోర్లు వేయించి పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



గజమాలతో మంత్రికి ఘన స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

భూ సమస్యలపై ప్రత్యేక ప్రజా దర్బార్

చిన్నమండెం : మండల పరిధిలోని బోరెడ్డి గారిపల్లెలో మంత్రి తమ నివాసం వద్ద ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఈ ఆరు మండలాలలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రతి మండలంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి భూ బాధితుల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని చెప్పారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలో ఎవరూ భూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను మంత్రి స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టారు.

నేర రహిత మదనపల్లె స్థాపనకు కృషి :సిఐ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నేర రహిత మదనపల్లె నిర్మాణానికి మనందరం కలిసి పని చేద్దామని మదనపల్లె వన్‌టౌన్ పట్టణ సిఐ ఎరిషావల్లి పేర్కొన్నారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మదనపల్లె పట్టణంలో ఎస్ఐగా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. ప్రశాంతతకు మారుపేరు మదనపల్లి అని, ఇక్కడి ప్రజలు చాలా శాంతంగా, సున్నితంగా ఉంటారని అన్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చి మదనపల్లె లో స్థిరపడిన కొంతమంది నేరాలకు పాల్పడుతుండంతో మదనపల్లెలో కొంత అశాంతి నెలకొనడంతో పాటు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాటిని నివారించేందుకు పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా గంజాయిని రూపుమాపాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తాము 24 గంటలు అందు బాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోవద్దని ప్రతిఒక్కరూ చట్టపకారమే నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాత్రికేయులు పట్టణం నలుమూలల తిరుగుతుంటారని, ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యక లాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే తమకు తెలియజేస్తే వాటిని మొగ్గ లోనే తుంచేసి సమస్యకు పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజలు సైతం పోలీసులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. చోరీలపై అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని, పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ముఖ్యంగా యువత మత్తుకు బానిస అవుతుండడంబాధాకరమని, వారికి కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. కళాశాలలు, పాఠశాలల్లో తరచుగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అన్సర్‌బాషా పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐ ఎరిషావల్లి

ఆలయాల భూముల అభివృద్ధే లక్ష్యం

జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్

ప్రజాశక్తి - రాయచోటి



ముఖా ముఖి..

జిల్లాలో ప్రజలకు, భక్తులకు అందుబాటులో ఉండి ఆలయాల భూముల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి. విశ్వనాథ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో దేవాలయాల వివరాల, వాటిని అభివృద్ధి ఎలా చేయాలో, నూతన ఆలయాలను ఎన్ని నిర్మిస్తున్నారో, భూములను ఎలా అభివృద్ధి చేయాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఆలయాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో మొత్తం ఆలయాలు 1655 ఉన్నాయి. 30 సత్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు ఆలయ ఇఒలున్నారు. ఇందు లో గ్రేడ్ - 1 ఇద్దరు, గ్రేడ్ -2 ఇద్దరు, గ్రేడ్ -3 ఇద్దరు ఆలయ ఈవోలు ఉన్నారు. శ్రీ రెడ్డమ్మ దేవత దేవస్థానం చెర్లోపల్లి గ్రామం, గుర్రంకొండ మండలం, శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం రాయచోటి టౌన్, శ్రీ గంగమ్మ దేవత దేవస్థానం అనంతపురం గ్రామం లక్కిరెడ్డిపల్లి మండలం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం మదనపల్లె టౌన్, సుండుపల్లె, రాజంపేట గ్రూప్, వాయల్పాడు, బి .కొత్తకోట గ్రూప్ దేవస్థానములున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఆలయాల భూముల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 9761.3 సెంట్లు ఉన్నాయి. బి. కొత్తకోట 380.95, చిన్నమండెం 445.16, చిట్వేల్ 187.17, గాలివీడు 686.63, గుర్రంకొండ 350.6, కలకడ 182.64, కలికిరి 315.93, కె.వి.పల్లి 218.52, రైల్వే కోడూర్ 534.23, కురబలకోట 417.91,లక్కిరెడ్డిపల్లి 205.54,మదనపల్లి 233.39, మొలకలచెరువు 270.58, నందలూరు 50.93, నిమ్మనపల్లి 132.17, ఓబులవారిపల్లి 185.85, పెద్దమండ్యం 395.58,పెద్దతిప్పసముద్రం 1194.59, పెనగలూరు 195.2, పీలేరు 220.1, పుల్లంపేట 190.22, రాజంపేట 262.83, రామాపురం 321.35, రామ సముద్రం 608.24, రాయచోటి 196.53, సంబేపల్లి 253.19, సుండుపల్లి 265.88, తంబళ్లపల్లి 471.6, వాయల్పాడు 208.67, వీరబల్లి 179.12 సెంట్ల భూములు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి.

ఆక్రమణకు గురైనటువంటి భూములపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లా వ్యాప్తంగా 47 ఆక్రమణకు గురైనట్లు గుర్తించడం జరిగింది. ఆక్రమణదారులకు నోటీసులిచ్చాం. ఇటీవల కాలంలో రామసముద్రం మండలం కురిజాల గ్రామంలో 1.60 సెంట్లు భూమిని స్వాధీనం చేసుకున్నాం. కలకడ మండలం తినోకొండ పాలెంలో వీరభద్ర స్వామి ఆలయానికి సంబంధించి సర్వే నెంబర్ 721 లో 3.93 సెంట్లుకు దేవాదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్‌ల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమానికి గురైన మిగులు భూములను కూడా త్వరలో స్వాధీనం చేసుకుంటాం. జిల్లాలో ఎవరైనా ఆలయాలు భూములు ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తే అలాంటి వారి పైన కఠిన చర్యలు తీసుకుంటాం.

జిల్లాకు కొత్తగా ఆలయాల ఏమైనా మంజూరయ్యాయా?

జిల్లావ్యాప్తంగా 20031 ఆలయాలు మంజూరయ్యాయి. ఇందులో మొదటి విడతలో 5721, మూడవ విడతలో 61, నాలుగో విడతలు 52 ఆలయాలు మంజూరయ్యాయి. దాదాపు 90 శాతం పనులు కూడా పూర్తి చేశారు. ఆలయాల నిర్మాణ పనులు కమిషనర్ దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. జిల్లాలో గత ప్రభుత్వంలో ధూపం నైవేద్యం పథకం కింద 270 ఆలయాలను గుర్తించి వారికి రూ . 5 వేలు చొప్పున ఇస్తున్నాం. కూటమి ప్రభు త్వం ఏర్పడిన తర్వాత వారికి మరో రూ .5 పెంచి రూ .10 వేలు అందజేస్తున్నాం. టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాలనీలలో 10 లక్షల స్కీము కింద అన్నమయ్య జిల్లాలో వివిధ ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ఆలయాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

2019 నుండి 2024 వరకు శిథిలావస్థలో ఉన్న ఆల యాల జీర్ణోద్ధరణ కోసం సర్వశ్రేయోనిధి అను స్కీము ను ప్రవేశపెట్టి తద్వారా రూ. 32 కోట్ల నిధులను మంజూరు చేసింది. అన్నమయ్య జిల్లాలోని రెండు నిర్మించేందుకు టిటిడి ద్వారా రూ. 38,00,000 మంజూరయ్యాయి.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా 80 మంది కార్యనిర్వక అధికారులు ఉండాల్సి ఉండగా ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఆలయాల పర్యవేక్షణ కష్టంగా మారింది. కడప, రాజంపేట ఇన్‌స్పెక్టర్లు వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలో పని చేయాలి. మదనపల్లె ఇన్‌స్పెక్టర్స్ తిరుపతి, చిత్తూరు జిల్లాలో విధులు చేపడుతున్నారు. జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నాం.

భక్తులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రస్తుతం ఆలయాల భూములను కౌలుకు ఇచ్చాం. మొత్తం చాలా తక్కువగా వస్తున్నాయి. ఇతర భూములతో పోల్చుకొని దేవాలయ భూములకు కూడా కౌలు మొత్తం పెంచాల్సిన అవసరముంది. ఆలయ ఆక్రమణ దారులను గుర్తించి దేవాదయ శాఖ చట్టం ప్రకారం నోటిసులును ఇచ్చి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆలయాలకు సబంధించిన ఎటువంటి సమస్య కానీ, ఆక్రమణ గురించి కానీ రాయచోటిలో శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం పక్కన ఉన్నటువంటి జిల్లా దేవదాయ శాఖ కార్యలయమును సంప్రదించవలసిందిగా కోరారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

నగలు, నగదు స్వాధీనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను ఆదివారం రాజంపేట పట్టణంలోని వేణుగోపాలస్వామి గుడి వద్ద రాజంపేట పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో డిఎస్‌పి ఎన్.సుధాకర్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా బిట్రగుంట కప్పట్రాళ్ల తిప్పకు చెందిన పీట్ల మహేష్, శిరీష్ కుమార్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో దొంగతనాలు పాల్పడుతూ ఉండేవారని తెలిపారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. పది లక్షలు విలువ చేసే బంగారు నగలు, రూ 3.10 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ మోసగాళ్ల బారిన పడకుండా తెలివిగా వ్యవహరించాలని అన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారం పట్ల పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట పట్టణ సిఐ యల్లమరాజు, రైల్వేకోడూరు గ్రామీణ సిఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి ఎఎస్ఐ రఘురాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి సుధార్

ఉత్తమ ఎన్‌సిసి సంస్థగా 'మిట్స్'

ప్రజాశక్తి-మదనపల్లి


మదనపల్లె సమీపంలో గల మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లో ఉత్తమ ఎన్‌సిసి యూనిట్ కలిగిన సంస్థగా గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. 8 సంవత్సరాలుగా ఎన్‌సిసి కార్యకలాపాల ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వం, సమాజ సేవను పెంపొందించడానికి ఇన్స్టిట్యూట్ నిబద్ధతను ప్రతిబింబిస్తు ఈ అవార్డు ను ఆంధిచినట్లు ఆయన అన్నారు. శిక్షణ, సామాజిక సేవా కార్యకలాపాలలో మిట్స్ ఎన్‌సిసి యూనిట్ అసాధారణ పనితీరు, రాష్ట్ర, జాతీయ స్థాయి ఈవెంట్‌లలో దాని క్యాడెట్‌ల స్థిరమైన విజయాలను ఈ అవార్డు గుర్తించిందని అన్నారు. లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్ కుమార్ మార్గ దర్శకత్వంలో మిట్స్ విజయవంతంగా ఎన్‌సిసి విలువలు, స్ఫూర్తికి ఉదాహరణగా నిలిచే యువ క్యాడెట్‌లను ప్రోత్సహించి ఈ అవార్డు కు దోహద పడిందన్నారు, హైదరాబాద్ లోని ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్‌లో ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన అన్నారు. 35 ఆంధ్రా బెటాలియన్, చిత్తూరు, మిట్స్ ఎన్‌సిసి యూనిట్‌కు నిరంతర మద్దతు, మార్గదర్శకత్వం అందించడంలో కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. విశేషమైన విజయానికి సహకరించిన వాటాదారులందరికీ కళాశాల కరస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కృతజ్ఞతలు తెలియజేశారు.



గుర్తింపు పత్రాన్ని చూపుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

మోసం చేయడంలో 'బాబు' బ్రాండ్ అంబాసిడర్

- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎన్నికల ముందు జోరుగా హామీలు ఇవ్వడం, అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని పీలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మరోసారి తన మార్కు నయ వంచనతో తానిచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ ప్రజల నడ్డి విరిస్తున్నారన్నారు. బాబు చెప్పిన ష్యూరిటీలు ఏమోకానీ, ప్రజలకు బాదుడు గ్యారంటీ అన్నట్లు రాష్ట్రంలో పరిస్థితి నెలకొందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ట్రూ అప్ ఛార్జీలు కూడా ఎత్తేస్తామని, ఇప్పుడు ఇష్టానుసారంగా ట్రూ అప్ ఛార్జీలను పెంచేస్తూ నిస్సిగ్గుగా బుకాయిస్తున్నారని విమర్శించారు. అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే రెండు సార్లు ట్రూ అప్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెబుతూనే రెండు సార్లు పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో స్కూల్, కాలేజీ ఫీజులు, పాల ధరలు, బియ్యం ధరలు, పప్పు దినుసులు, కూరగాయల రేట్లు పెరిగాయన్నారు. ఉచిత ఇసుకను కూడా అధిక ధరలకు అమ్ముకుంటున్నారని, మద్యం ధరలు, రిజిస్ట్రేషన్ ధరలు కూడా పెరిగాయన్నారు. ప్రజలు తమ ఆదాయాలను చంద్రబాబు సిండికేట్లకు సమర్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, ఈ ఖర్చులు భరించలేక ఇప్పటికే ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. సామాన్యుడు బతికే పరిస్థితి రాష్ట్రంలో కనిపించడం లేదని, అధిక వడ్డీలకు ప్రజలు బలవుతున్నారని, ప్రజల జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీం, ఆనంద పాల్గొన్నారు.

జిల్లా యాదవ ఎంప్లాయీస్ సొసైటీ కార్యవర్గం ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా యాదవ్ ఎంప్లాయీస్ సొసైటీ (వైఇఎస్) కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని యాదవ్ ఎంప్లాయీస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ రమేష్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకయ్య యాదవ్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని వైష్ణవి స్టడీ సెంటర్‌లో యాదవ్ ఎంప్లాయీస్ సొసైటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి యాదవ్ ఎంప్లాయీస్ సొసైటీ రాయచోటి, మదనపల్లె , రాజంపేట యాదవ్ సభ్యులు హాజరయ్యారు. యాదవ్ పెద్దల ఆమోదంతో అన్నమయ్య జిల్లా యాదవ్ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షులుగా గోరంట్ల నాగేంద్రబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటయ్య యాదవ్, ట్రెజరర్‌గా దూళ్లవారిపల్లె శ్రీనివాసులు యాదవ్, మహిళా గౌరవ అధ్యక్షురాలుగా పి. పద్మావతమ్మ, గౌరవ అధ్యక్షులుగా గుంజు కృష్ణయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్రయాదవ్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా హరినాథ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా యాదవ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షులు పి. చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నరసింహులు యాదవ్, గౌరవాధ్యక్షులు నంద్యాల రాజశేఖర్ యాదవ్, పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ఏపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. వెంకట్రామయ్య తెలిపారు. ఆదిఆవరం నియోజక వర్గం పరిధిలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ గ్రామపంచాయతీల్లో కార్మికులు జోరు వానను సైతం లెక్కచేయకుండా పారిశుధ్య పనులు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కార్మికుల కష్టాలను చూసి స్పందించి పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కనీస వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. తమ ఉద్యోగ భద్రత కోసం గత ప్రభుత్వాల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతున్నా.. పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు తీసుకు వెళ్లి, తగు న్యాయం చేయాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని చిత్తూరు జిల్లాలో కార్మికులకు హైకోర్టు అనుమతి జారీ చేసిందని చెప్పారు. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పంచాయతీ పారిశుద్ధ కార్మికుల ఉద్యోగ భద్రత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని నియోజకవర్గ ఎమ్మెల్యేకు కార్మికుల తరపున విజ్ఞప్తి చేశారు.



వర్షంలోనూ పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు


రూపానందరెడ్డి, కెకె చౌదరికి వినతిపత్రం అందిస్తున్న ఆటోనగర్ కార్మికులు

ఆటోనగర్ కార్మికులకు న్యాయం చేస్తాం :'ముక్కా'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆటోనగర్ కార్మికులకు న్యాయం చేస్తామని అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో ఆటోనగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముక్కా రూపనంద రెడ్డి, ఎపిఖాదీ,గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కెకె.చౌదరిలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆటో నగర్ వర్క్ షాపు కార్మికులు గత 30 సంవత్సరాలుగా స్థలం లీజుకు తీసుకొని పనిచేస్తూ జీవనం సాగిస్తున్నామని వారి దృష్టికి తీసుకొచ్చారు. కార్మికులందరూ సొంత స్థలం లేక అద్దెలు కట్టలేని పరిస్థితులలో అష్టకష్టాలు పడుతూ సతమతమవుతున్నారని తెలిపారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా మా ఆటోనగర్ కార్మికులకు న్యాయం జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం లోనైనా ఆటోనగర్ కార్మికులపై చొరవచూపి ప్రభుత్వ అధికారులతో చర్చించి, ప్రభుత్వ భూములను పరిశీలించి ఆటోనగర్ కార్మికుల సంక్షేమము కొరకు ప్రభుత్వ స్థలం కేటాయించే చర్యలు తీసుకోవాలని రూపానందరెడ్డి, కెకె చౌదరిలకు వినతి పత్రం అందించారు. అనంతరం వారిని గజమానులతో ఘనంగా సన్మానించారు. రూపానంద రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఇచ్చిన వినతి పత్రం పరిశీలించి, ఆటోనగర్ కార్మికులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కట్టా గుండయ్య నాయుడు, టివి.రమణారెడ్డి, గడిగోట సుబ్బరాయుడు, తాతంశెట్టి నాగేంద్ర, మాజీ ఎంపిపి తిరుపాల్, ఆటోనగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం లోకనాథం ఆచారి, ఉపాధ్యక్షులు గంగాప్రసాద్, కార్యదర్శి మహబూబ్ బాషా, కోశాధికారులు ఎస్‌విఎస్ మణి, జి.గంగాధర్, కార్యవర్గ సభ్యులు ఎం.చంటి, దాము, కృష్ణ, బాలాజీ, హరి, శ్రీరాములు పాల్గొన్నారు.


మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న లక్ష్మీపతి

సిసి రోడ్డు మంజూరు చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని బీరంగి పంచాయతీ, బండెన్నస్వామి ఆలయం వరకు సిసి రోడ్డు మంజూరు చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతి కోరారు. ఆదివారం చిన్నమండెం మండలం, బోరెడ్డిగారిపల్లిలో మంత్రిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బండెన్నస్వామిగుడి వరకు సిసి రోడ్డు నిర్మించేందుకు తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం లక్ష్మీపతి మాట్లాడుతూ బండెన్న స్వామి ఆలయానికి నిరంతరం భక్తులు వస్తుంటారని, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆలయం వరకు సిసి రోడ్డు వేయాలని మంత్రిని కోరామని, ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అన్నారు. ఆలయం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామిన అన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి బోధన ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతిచెందిన నరసింహులు, సూర్య నారాయణల మృతదేహాలు మార్చురీలో ఉంచారు. దహన సంస్కరాల కోసం వారి బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో మదనపల్లి టూటౌన్ పోలీసులు హెల్పింగ్ మైండ్స్ బృందాన్ని సంప్రదించారు. ఆ సంస్థ సభ్యులు వారి దహన సంస్కరాలను హిందు సాంప్రదాయ బద్దంగా, హిందు శ్మశాన వాటికలో నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ అనాథ మృతదేహాలను వారివారి మత సాంప్రదాయ బద్దంగా తమ సంస్థ సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో 917 కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు చేశామన్నారు. ఫుడ్ బ్యాంక్, సానిటరీ ప్యాడ్ బ్యాంక్, ఉచిత బాడీ ఫ్రీజర్ బాక్స్, రక్తదాన శిబిరాలు, కేన్సర్ భాదితులకు ఉచితంగా విగ్గులు పంపిణీ ఇలా పలు సేవలను హెల్పింగ్ మైండ్స్ బృందం చేపట్టి అందరి ప్రశంసలను అందుకుంటోందన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, ముఫీ, జైనుల్లా, గౌస్, అర్వాజ్, అంబులెన్స్ కమ్మల రఘు, సూరి పాల్గొన్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి

- మండల వ్యవసాయాధికారి నవంత్‌బాబు

ప్రజాశక్తి - చక్రాయపేట

ఫెంగల్ తుఫాను వల్ల కంది, మినుము, పెసర పంటలు దెబ్బ తినకుండా రైతులు పలు సూచనలు పాటించాలని ఆదివారం వ్యవసాయ అధికారి నవంత్‌బాబు అవగాహన కల్పించారు. మండలలో ఎర్రగుడి, కల్లూరుపల్లి గ్రామాల్లో కంది సాగు చేస్తున్న రైతులు పొలంలో మురుగునీటిని వీలైనంత త్వరగా బయటికి పంపాలన్నారు. పైరు కోలుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాములు 191919 లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలన్నారు. వర్షాలు తగ్గిన వారం తర్వాత మారుకామచ్చల పురుగును నివారించడానికి క్లోరోపైరీఫాస్ 2.5 శాతం, లేదా నోవాల్యూరాన్ 1 శాతం లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మినుము, పెసర పంటలో మురుగు కాల్వల ద్వారా పొలంలో నిలిచి ఉన్న నీటిని బయటికి తీసివేయాలి. ఇనుపధాతు లోపం గుర్తించినప్పుడు లీటర్ నీటికి ఐదు గ్రాములు అన్నభేది, 0.5 గ్రామ్ నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేయాలి. పైరు త్వరగా కోలుకోవడానికి లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా ద్రావణాన్ని పిచికారి చేయాలి. లీటర్ నీటికి 10 గ్రాముల 191919 లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేయాలి. అధిక తేమ వల్ల వేరుకుళ్ళ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కాపరాక్సి క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణను హెక్సా కొనజోల్ 2 శాతం వారం రోజుల తర్వాత లీటర్ నీటికి పిచికారి చేసుకోవాలి. వరి కోతలు ప్రస్తుతానికి వాయిదా వేయాలని ఎఒ రైతులకు సూచించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే శంకర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ములకలచెరువు


కేకు కట్ చేస్తున్న శంకర్ యాదవ్ అనుచరులు

మండల కేంద్రమైన ములకలచెరువులో తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆయన వర్గీయులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో టిడిపి నాయకులు భారీ ఎత్తున కేక్ కోసి నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ యాదవ్ ఇలాంటి పుట్టినరోజు వేడు కలు మరెన్నో జరుపుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు దక్కించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి ముత్తుకూరు మౌలా, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు విజయ్ కుమార్, మైనార్టీ అధ్యక్షులు జహీర్, పార్లమెంట్ తెలుగు కార్యదర్శి కక్కల సుదర్శన్, టిడిపి నాయకులు, పాల్గొన్నారు

ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యత


పీలేరులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని, అది అందరి బాధ్యత అని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్‌ఎంఒ డాక్టర్ ప్రసాద్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఐసిటిసి కౌన్సిలర్ పుల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన, నివారణపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ హెచ్‌ఐవి ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకూడదని పేర్కొన్నారు. ఈ వ్యాధి నియంత్రణకు సమిష్టి కృషి చేద్దామ న్నారు. అలాగే ఎయిడ్స్ వ్యాధిపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఎఎన్‌ఎం, ఆశాలు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** ఎయిడ్స్ వ్యాధిని పారద్రోలి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జయ భారతి, వైస్ ప్రిన్సిపల్ రమణయ్య లు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ పుష్ప కుమారి, హెచ్‌ఐవి, ఎయిడ్స్ నిర్మూలనకు పాటించవలసిన పద్ధతులను గురించి వివరించారు. అనంతరం ఫ్లకార్డ్స్ ప్రదర్శిస్తూ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని ఎయిడ్స్ వ్యాధిని పారద్రోలుదాం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వ్యాధి నివారణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం లో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దామని కళాశాల ప్రిన్సిపల్ అంజలి దేవి తెలిపారు. ఆదివారం ఎస్‌డబ్ల్యూఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో ఆర్. ఆర్‌సిఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వ ర్యంలో హెచ్‌ఐవిపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఐవి సంక్రమణ విధానాలు, నివారణ పద్ధతులు, చికిత్సా విధానాలపై ఆర్ ఆర్ ఎస్ సిబ్బంది శ్వేత, పల్లవి విద్యా ర్థులకు అవగాహన కల్పిం చారు. ఫేస్ పెయింటింగ్, పెయిం టింగ్, రంగోలి, వ్యాస రచన, మైమ్ రీల్ వంటి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహు మతి ప్రదానం చేశారు. అనంతరం మాన వహారం నిర్వహించారు. కార్య క్రమంలో ఆర్‌ఆర్‌సి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్. గులాబ్ జాన్, కె.మాధవి, ఉదయ, లిఖిత, జి. మాధవి, హాజీరా, శైలజ, కీర్తి, అనూష పాల్గొన్నారు. **పీలేరు:** ఎయిడ్స్ మహ మ్మారిని సమర్థవంతంగా ఎదుర్కోడానికి మనమందరం బాధ్యత వహిద్దామని, అందుకు ఎయిడ్స్ డే ఓ వేదికని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి సాధారణ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ నాగవేణి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ, స్థానిక ఐసిటిసి విభాగం, తలుపుల, రేగళ్ళ పిహెచ్‌సి, ఐసిడిఎస్, స్వయం సహాయక సంఘాలు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, అవగాహన ర్యాలీ, ప్రశ్ని కార్యక్రమాలు సంయుక్తంగా 'నా ఆరోగ్యం నా హక్కు" అనే నినాదంతో ఎయిడ్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి నివారణకు కృషి చేద్దామని అందరూ కలిసి ప్రతిజ్ఞ, ఓ..యువతా మేలుకో ఎయిడ్స్ గురించి తెలుసుకో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ, మానవాహారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మునిరేఖ, సిహెచ్‌ఒ జయలక్ష్మి, హెచ్‌ఇ కొండయ్య, వెలుగు ఎపిఒ జవహర్‌బాషా, పర్యవేక్షకులు శ్రీను, చిన్నప్ప, స్వరూప, కోర్ సంస్థ ఉద్యోగి రాజమ్మ, సిబ్బంది, తలుపుల, రేగళ్ల పిహెచ్‌సిల ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యమని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శేఖర్ అన్నారు. ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల విద్యార్థుల చే ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రి నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శేఖర్ మాట్లా డుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ యాసీన్, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్, లక్ష్మీ దేవి, ల్యాబ్ టెక్నీషియన్ చైతన్య, ఎఎన్‌ఎంలు, ఆశాలు, వైఆర్‌జి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** తంబళ్లపల్లి సిహెచ్‌సిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కృషి సంస్థ, ఐసి టిసి సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహి ంచారు. ఫ్లకార్డు చేత పట్టుకుని నినా దాలు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ ఈ ఏడాది హక్కుల మార్గాన్ని అనుసరించండి.. నా ఆరోగ్యం నా హక్కు అనే నినాదం ఇచ్చినట్లు తెలిపారు. హెచ్‌ఐవి నివారణకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రాంత్ రెడ్డి, ఐసిటిసి కౌన్సిలర్ చంద్ర మోహన్, ఎల్‌టి బాలాజీ, కృషి సంస్థ మేనేజర్ శ్రీనివాసులు, ఒఆర్ డబ్ల్యు సావిత్రి, రేఖ, ప్యారి, నాగరాణి, ఫోర్డ్ నరసింహులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని ఏరియా ఆసుపత్రి నుండి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్నెంట్ నిలోఫర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** సమాజ భాగస్వామ్యంతో ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించవచ్చని స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రవికుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి గాంధీ బస్టాండ్ వరకు ఎయిడ్స్ వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వల్ల జరిగే నష్టాలు ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ప్రజలకు వివరించారు. ఆరోగ్య సిబ్బందితో మానవహారం నిర్మించి ఎయిడ్స్ వ్యాధి పట్ల నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలక్ష్మీ, లతాంజలి, క్రిష్ణమూర్తి నాయక్ పాల్గొన్నారు.



కలకడలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


మదనపల్లిలో ర్యాలీ చేపట్టిన వైద్యసిబ్బంది

భగవద్గీత శ్లోకాల పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈనెల 11న గీతా జయంతిని పురస్కరించుకొని టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు అన్నమయ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు ఘనంగా జరిగాయి. పట్టణ పరిధిలోని మన్నూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 6, 7 తరగతుల విభాగంలో రాజంపేట బాలికోన్నత పాఠశాలకు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని శ్రావణ లక్ష్మి, అక్షర స్కూల్ కు చెందిన ఆరవ తరగతి విద్యార్థిని ఎన్.సాయి యోషిత, రాజు స్కూలుకు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని కె.సాహితీలు వరుసగా మూడు బహుమతులు గెలుచుకున్నారు. 8, 9, 10 తరగతుల విభాగంలో చిట్వేలు మండలం తిమ్మయ్య గారిపల్లెకు చెందిన ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ 8వ తరగతి విద్యార్థిని పి.వన్యశ్రీ, రాజంపేట శ్రీ చైతన్యలో 9వ తరగతి చదువుతున్న శివ పార్వతి, రాయచోటికి చెందిన శ్రీ చైతన్య విద్యార్థిని పి.అన్వితలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. సంపూర్ణ భగవద్గీత పోటీలలో రాయచోటికి చెందిన అన్విత, మదనపల్లి విజయదుర్గ పాఠశాలకు చెందిన ధన్వికలు ప్రథమ, ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, రాజంపేట ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ప్రధాన ఆచార్యులు వెంకటసుబ్బారెడ్డి, విశ్రాంత ఉపన్యాసకులు బొట్టా రామచంద్రయ్య నాయుడు, భగవద్గీత నారాయణ, యూ.పీ రాయుడు, దామోదరమ్మ, శ్రీదేవి, ఆకేపాటి మహేశ్వరమ్మ, స్రవంతిలు వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.750, తృతీయ బహుమతి రూ.500లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముప్పాల శివశంకర్ రాజు, సిద్ధవటం రెడ్డిప్రసాద్, హనుమంతు,వేణుగోపాల్‌రెడ్డి, వేల్పుల వెంకట సుబ్బయ్య, తంబా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రవచనాలతో ప్రయోజనం

నందలూరు : భగవద్గీత ను చదవడం వలన, గీతా ప్రవచనాలను వినడం ద్వారాఎంతో జ్ఞానాన్ని, పొందవచ్చని విశ్రాంత తహశీల్దార్ నాయన పల్లి జయన్న, గెలివి రత్నంశెట్టి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవ పల్లె గ్రామంలో వెలసిన శ్రీకృష్ణ గీతా మందిరంలో ఈనెల 4 నుంచి 10 తేదీ వరకు శ్రీమద్ భగవద్గీత ప్రవచనాలు కడప పట్టణానికి చెందిన అచ్చోలి ముకుందరెడ్డి బోధించడం జరుగుతుందని అన్నారు.11వ తేదీన గీతా జయంతి కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు.

భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


రైల్వేకోడూరు జలమయమైన ప్రధాన రహదారి

రైల్వేకోడూరు పట్టణంలో శనివారం తెల్లవారుజామున నుంచి కురుస్తున్న భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమైంది. ప్రధాన రహదారిలో భారీగా వరద నీరు ప్రవహిస్తూ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని అంకమ్మ నగర్ లోతట్టు ప్రాంతంలో వర్షపు నీళ్ళు పోయేం దుకు వీలులేక వీధులన్నీ జలమ యమయ్యాయి. గుంజన నదీ పరివాహక ప్రాంతంలో నివాసమున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రధాన రహదారిపై వర్షపు నీరు ప్రవహి స్తూ ఉండడం వలన తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్న చిన్న బుట్టలలో పండ్లు పూలు విక్రయించే వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా చిన్న చిన్న కాలువలు మాత్రమే ఉండడం వలన వర్షపు నీరు భారీగా రోడ్లపై చేరిపోయి వాహనాలు రాకపోకులకు ఏర్ప డింది. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం విచారకరమని ప్రజలు వాపోతు న్నారు. శనివారం ఉదయం నుంచి ఆది వారం ఉదయం వరకు 123.8 మి.మీ., మధ్యాహ్నం రెండు గంటల వరకు 34.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోద యిందని అధికారులు వెల్లడించారు.

బాలపల్లె వద్ద జలపాతంలా వర్షపు నీరు

మండలంలోని బాలుపల్లె చెక్ పోస్ట్,కుక్కల దొడ్డి మార్గ మధ్యలో అటవీ ప్రాంతం నుంచి వర్షపు నీరు ప్రధాన రహదారి పక్కనే జలపాతంలో ప్రవహి స్తోంది. భారీ వర్షాలు పడిన ప్రతిసారి ఈ ప్రాంతాల్లో వాటర్ ఫాల్స్ లాగా వర్షపు నీరు ప్రవహిస్తూ ఉంటుంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు,వాహనాలలో వెళ్లే ప్రయాణికులు వాటర్ ఫాల్స్‌ను వీక్షించి ఎంజాయ్ చేస్తుంటారు. గతంలో భారీ వర్షాలు పడి రోడ్డుపై కూడా వరద నీరు ప్రవహించి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పొంగి పొర్లుతున్న ప్రాజెక్టుకు జలహారతి

ప్రజాశక్తి-పీలేరు

వర్షపు నీటితో నిండి పొంగి పొర్లుతున్న ప్రాజెక్టుకు పీలేరు గ్రామపంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, వార్డు సభ్యులు జలహారతులు పట్టారు. పీలేరు మండలం, బాలంవారిపల్లి పంచాయతీ, గార్గేయనదిపై నిర్మించిన ప్రాజెక్టు వర్షపు నీటితో నిండి పొంగి పొర్లుతున్న సమాచారం అందిన వెంటనే ఆదివారం సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. నిండుకుండను తలపిస్తున్న ప్రాజెక్ట్ నీటికి జలహారతి పట్టారు. ప్రాజెక్టుకు నిండా నీరు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు విక్టరీ వెంకటరమణారెడ్డి, పరమేష్, పిక్కా రమణ, ఆబిద్, ఎఎంసి మాజీ డైరెక్టర్ బిడి మహేష్ రెడ్డి, వాటర్ మెన్స్ వెంకటరామయ్య, ఓబులేసు, లక్ష్మయ్య పాల్గొన్నారు.


ప్రాజెక్టు వద్ద జలహారతి పడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా


అవార్డు అందుకుంటున్న సయ్యద్ సర్తాజ్ హుస్సేన్

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి :'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సహదేవయ్య శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సహదేవయ్య దంపతులకు సన్మాన కార్యక్రమం హేమాచార్య కళ్యాణమండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి, దేశానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, వారి క్రమశిక్షణ, నడవడిక సమాజ అభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఎంతగానో దోహం చేస్తాయని, ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలని అన్నారు. 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తును ఉన్నత స్థానాలకు తీర్చిదిద్ది న ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందడం విద్యార్థిలకు, తోటి ఉపాధ్యాయులకు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు సంపత్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు జయకుమార్ జడ్‌పిహెచ్‌ఎస్ సదుం, విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, కుమార్తెలు డాక్టర్ ఆర్ లావణ్య, డాక్టర్ ఆర్‌ఎం హిమబిందు, అల్లుళ్ళు కె.వినోద్ కుమార్, డాక్టర్ సివి శివప్రసాద్, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎంపిడిఒ కార్యాలయంలో స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల నాయకులు యనమల మదనమోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మండలంలో ఉన్నటువంటి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తమ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుక వెళితే పరిష్కారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, అంజాద్, కాంటాక్ట్ రాజు, ఆంజనేయులు, మసూద్, రహమత్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీ యందున్న లక్ష్మీ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు ఆదివారం సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామ సచివాలయ ఉద్యోగులు యువరాజు, ప్రవల్లిక, శ్రీలత,బాబుల్ రెడ్డి, ధర్మేంద్రలు భోజనం, పండ్లు అందచేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఈ రోజు వృద్ధులతో ప్రేమ, ఆప్యాయతలను చూపి వారికి భోజనం,పండ్లను తాము అందించి గడపడం చాలా ఆనందంగా ఉందన్నారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహా రెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం పుణ్యకార్యక్రమం అని, నేడు దేవపట్ల సచివాలయ ఉద్యోగులు వృద్ధులకు భోజనం, పండ్లు అందించడం అభినందనీయం, ఆదర్శనీయమన్నారు. లక్ష్మీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచితంగా అందుతున్న సేవలను ఆయన ప్రశంసించారు. అర్చన విద్యాసంస్థల అధినేత మదన మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి , పరిసర ప్రాంతాలకు చెందిన దాతలు , వివాహ, జన్మదిన, వేడుకల సందర్భంగాను, జ్ఞాపకార్థ కార్యక్రమాల వృద్ధాశ్రమ వృద్ధులకు భోజనాలు, పండ్లు అందిస్తూ వృద్ధులకు చేయూతనిస్తున్నారని, వృద్ధులకు భోజనం,పండ్లు పంపిణీ చేసిన దేవపట్ల సచివాలయ ఉద్యోగులకు ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్


ప్రమాదంలో గాయపడిన బాధితులు

ఆర్‌టిసి బస్సు బోల్తా

-ప్రయాణికులకు గాయాలు..ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలకోట మండలం అంగళ్లు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కనిగిరి ఆర్‌టిసి బస్సు కారును ఢీకొట్టి బోల్తా పడడంతో పలువురు ప్రయాణికులు గాయపడగా ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనిగిరి నుంచి బెంగుళూరుకు బయల్దేరిన ఆర్‌టిసి బస్సు మార్గమధ్యంలోని కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టి అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా స్థానికులు వారిని అంబులెన్స్ లో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారిని రుయాకు రెఫర్ చేశారు. గాయపడ్డ వారిలో బెంగళూరుకి చెందిన చిన్నయ్య, కొండమ్మ, వెంకటరమణ, కోసువారిపల్లి కు చెందిన బావాజీ, కనిగిరికి చెందిన లేయమ్మ, సాలమ్మ, కనిగిరి వెనుగొండకు చెందిన మాలకొండయ్యలు ఉన్నారు. వీరిలో మాల కొండయ్య, లేయమ్మల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో డాక్టర్లు వారిని ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రిఫర్ చేశారు. తక్కిన వారంతా మదనపల్లి జిల్లా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఘటనపై ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్, సిఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి

రాయచోటి : జిల్లాలోని కురబలకోట మండలం, అంగళ్లు బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం జరిగిన బస్సు ప్రమాదంపై రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి బస్సు ప్రమాదానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రమాదంలో గాయపడిన ప్రయాణీకులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. గాయపడిన వారిని ఆదుకుంటామని తెలిపారు.